క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, సిటీ సబ్‌స్టేషన్, 11కేవీ నక్కలరోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నక్కలరోడ్డు, చిలుకు దుర్గయ్య వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, నరసింహారావు నాయుడు వీధి, కాశేశ్వరరావు రోడ్, వెంకటరత్నం వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మూడు వేలమందికి అన్నప్రసాద వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీకోదండ రామాలయం సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు మూడు వేల మంది భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేసి స్వామివారి ప్రసాదంను భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కే వీర్రాజు, గంగిశెట్టి సాంబశివరావు, ఉపాధ్యక్షుడు కే సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి రామారావు తదితరులు పర్యవేక్షించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రౌడీషీటర్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను హెచ్చరించారు. స్థానిక గుణదల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగుతుందని తప్పు చేస్తే తప్పించుకోలేరని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆర్ఆర్ఆర్ ఎగ్జిబిషన్



లబ్బీపేట(విజయవాడతూర్పు): వేసవిని పురస్కరించుకుని బృందావనకాలనీ వజ్ర గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. ఆర్ఆర్ఆర్ సెట్టింగులతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను ఆదివారం ఎగ్జిబిషన్ సొసైటీ మాజీ కార్యదర్శి మలినేని నారాయణప్రసాద్, నంది అవార్డ్స్ జ్యూరీ మెంబర్, నటుడు నందివాడ నాని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో పిల్లలకు ఆటవిడుపు కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో జైంట్‌వీల్, మేరీ కొలంబస్, బ్రేక్ డ్యాన్స్ డ్రాగన్ ట్రైన్, ఇండియన్ టొరాటోరా, ఇటాలియన్ ఐటమ్స్ వంటి ప్రత్యేకమైన ఆటవస్తువులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు గోపీనాథ్ మాట్లాడుతూ విజయవాడకే తలమానికంగా ఆర్ఆర్ఆర్ సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ ఎన్నడూ చూడని విధంగా ఆర్ఆర్ఆర్ చిత్రంలోని కోటను ఎగ్జిబిషన్ ప్రధాన ద్వారంగా ముస్తాబు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు నుంచి 10 గంటల వరకూ ప్రదర్శన ఉంటుందన్నారు. వజ్ర గ్రౌండ్స్ అధినేత వల్లూరి రవితేజతో పాటు దొంతాల ప్రకాష్, కిరణ్ అడపా తదితరులు పాల్గొన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో హరివిల్లు ఫౌండేషన్ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యాధరపురం, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. పాదచారులు, వాహనచోదకుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని హరివిల్లు ఫౌండేషన్ సహాయ కార్యదర్శి యు.కనకారావు తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ వేసవి తాపంతో ఇబ్బంది పడుతున్న పాదచారులకు, వాహనచోదకులకు చల్లటి మజ్జిగను అందజేశామన్నారు. ఫౌండేషన్ కోశాధికారి ఎం.రవికుమార్, వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌కుమార్, శ్రీదేవి, అధ్యక్షుడు ఎం.శశికాంత్, కె.శ్రీనివాసరావు, జీఎస్‌బీ అప్పలరాజు, కె. సుబ్రహ్మణ్యం, పి.త్రినాథ్, పిట్ల రమేష్‌కుమార్, మణికంత, అజయ్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చైత్రమాస ఉత్సవాలు



దుర్గమ్మ కొలువుదీరిన ఇంద్రకీలాద్రిపై చైత్రమాస బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు వెండి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామి వారు భక్తుల ఇంట ముంగిటకు విచ్చేయడంతో తన్మయానికి లోనయ్యారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





నేడు 'వెలంపల్లి శ్రీనివాసరావు' నామినేషన్

- సత్యనారాయణపురం శివాజీ కేఫ్ నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకూ ర్యాలీ
- వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని సెంట్రల్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో అసలైన అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని అన్నారు. మళ్లీ మన నియోజకవర్గంలో అభివృద్ధి మరింత పరుగులు తీయాలనే ఆకాంక్షతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే వెలంపల్లికి సెంట్రల్ నుంచి అవకాశం కల్పించారని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు నామినేషన్ వేయనున్నట్లు వివరించారు. ఉదయం ఏడు గంటలకు సత్యనారాయణపురం శివాజీ కేఫ్ నుంచి ప్రారంభమై సత్యనారాయణపురం, గాంధీనగర్, ఏలూరు రోడ్డు మీదుగా పోలీస్ కంట్రోల్ రూమ్, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుంటారని తెలిపారు. వెలంపల్లి నామినేషన్‌ను సెంట్రల్ నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ బాలి గోవింద్, వైఎస్సార్ సీపీ నాయకులు అంగిరేకుల నాగేశ్వరరావు, కనపర్తి కొండా, పెనుమత్స సత్యం, గుండె సుందర్‌పాల్, ఇసరపు రాజు, బెవర నారాయణ, ఉమ్మడి వెంకట్రావు, అలంపూరు విజయ్, మోదుగుల గణేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి



30వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి



32వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న గుండే సుందర్‌పాల్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీతోనే అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని 30వ డివిజన్ కార్పొరేటర్ బీ జానారెడ్డి అన్నారు. స్థానిక 30వ డివిజన్ రామకృష్ణాపురంలో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని నానిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. అలాగే సోమవారం వెలంపల్లి శ్రీనివాసరావు నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో..

స్థానిక 27వ డివిజన్ బావాజీపేటలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానికు ఓట్లు వేసి గెలిపించాలని ఆ పార్టీ డివిజన్ కన్వీనర్ కొండాయగుంట రాము అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి రమేష్, కొండా ఏసుపాదం, లోకేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక 32వ డివిజన్‌లో ఆదివారం వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు ఆర్‌యూబీ పనులు





తుది దశకు చేరుకున్న మధురానగర్ ఆర్‌యూబీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఐదు డివిజన్ల వాసుల చిరకాల కోరికగా మిగిలిన మధురానగర్ ఆర్‌యూబీ పనులు తుదిదశకు చేరుకున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురానగర్ రైల్వే స్టేషన్ మీదుగా నిత్యం పెద్ద సంఖ్యలో రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తరచూ రైల్వేగేటు పడుతుండటంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఒకటి, 28, 29, 30, 31వ డివిజన్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులను తొలగించేందుకుగానూ ఎమ్మెల్యే మల్లాది విష్ణు రూ. 17 కోట్లతో ఆర్‌యూబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. అయితే కోవిడ్, సాంకేతిక కారణాలతో ఆర్‌యూబీ పనులు కొంతకాలం నిలిచిపోయాయి. దీంతో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో మాట్లాడి పనులు పునఃప్రారంభింపజేశారు. ప్రస్తుతం పనులు తుదిదశకు చేరుకున్నాయి. వారం రోజుల్లోపు ఆర్‌యూబీని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

మానసిక ఆరోగ్యానికి యోగ సాధన



యోగ శిక్షణ తరగతుల్లో విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శారీరక, మానసిక ఆరోగ్యం కోసం యోగ సాధన అవసరమని గ్రంథాలయాధికారిణి కే రమాదేవి అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం ఆధ్యాత్మిక విశ్వగురువులు, సైంటిఫిక్ సెయింట్ గురు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఉచిత యోగాసన, ప్రాణాయామ, ధ్యాన శిక్షణ అవగాహన తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణ తరగతులను ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ఠాగూర్ గ్రంథాలయంలో ప్రతీ ఆదివారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు తొమ్మిది వారాల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తొలిరోజు సుమారు 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ట్రైనర్ వి.ప్రభాకర్, సూర్య, ఆకాశవాణి ఇంజినీర్ టి.నాగేశ్వరరావు గురుదేవుల విశిష్టతను ఆసన, ప్రాణాయామ ధ్యానం వల్ల లాభాలను వివరించారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్టీలు సీహెచ్ నారాయణరావు, జీ ప్రమీల, పలువురు స్ఫూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

500 మందికి వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఏపీఐఐసీ కాలనీలోని జమాక్ హౌసింగ్ భవన సముదాయంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. విజయవాడ లేడీస్ సర్కిల్, రౌండ్‌టేబుల్, సంజీవని స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 500 మందికి అన్ని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, బ్లడ్‌కల్చర్, ఈసీజీ, దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు హర్ష, అమూల్య, డాక్టర్ చాగంటి సుబ్బారావు, సునీత, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వయోవృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అన్నయ్య ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ మాట్లాడుతూ ప్రతినెలా వయోవృద్ధులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నామని అన్నారు. ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం, బీ సుజాత మాట్లాడుతూ వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టీలు తట్టి అర్జునరావు, లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడకల్చరల్: అభినయ నృత్యాలయం ఆధ్వర్యంలో శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సత్యనారాయణపురం సీతారామ కల్యాణ వేదికపై ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. నాట్యాచారిణి వీ కృష్ణగౌతమి ఆధ్వర్యంలో చిన్నారులు హిమజ, జ్యోత్స్నిక, హర్షిత, వర్షిణి, రమ్యలు కూచిపూడి సంప్రదాయంలో మహా గణపతింతో ప్రారంభించి వినాయక కౌతం, రామదాసు కీర్తన, పలుకే బంగారమాయనా, అన్నమయ్య సంకీర్తన తందనానా ఆహి, ధేంతలూరే, సిరినవుల వాడే కీర్తనలకు నృత్యాలను అభినయించారు. నాట్యాచారిణి కృష్ణగౌతమి మాట్లాడుతూ కూచిపూడి నృత్య సంప్రదాయ రీతులను పరిరక్షించుకోవాలని సూచించారు. నిర్వాహకుడు గుడిపాటి దత్తు చిన్నారులను సత్కరించారు.

కళాకారులు సాంస్కృతిక రాయబారులు



రమా సత్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక రాయబారులని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. స్వరార్చన సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం నూతన తెలుగు సంవత్సరం, శ్రీరామనవమి సందర్భంగా సినీ సంగీత విభావరి, వివిధ రంగాలకు చెందిన వారికి ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమా సత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు ఉంటుందన్నారు. దేశ సాంస్కృతిక వైభవంలో వారు భాగస్వాములని తెలిపారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు ప్రజాసేవలో పాల్గొనాలని సూచించారు. స్వరార్చన నిర్వాహకుడు యూవీ రత్నం సంస్థ లక్ష్యాలను వివరించారు. అనంతరం పరచూరి విజయలక్ష్మి, నిడుమోలు రమా సత్యనారాయణను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

సందడిగా శోభాయాత్ర



వన్‌టౌన్‌లోని జైనులు ఆదివారం నిర్వహించిన శోభాయాత్ర సందడిగా సాగింది. మహావీర్ జయంతిని పురస్కరించుకొని జైనులు భారీ యాత్ర నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, పిల్లలు, పెద్దలు పాల్గొని కోలాహలంగా ముందుకు సాగారు. వెండి రథంలో మహావీరుని విగ్రహాన్ని జైనులు ఊరేగించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





29 నుంచి బాబా మందిర వార్షికోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం మారుతి వ్యాయామశాల సమీపంలోని శ్రీలక్ష్మీగణపతి, షిర్డీ సాయిబాబా భజన మందిరంలో ఈ నెల 29వ తేదీ నుంచి 21వ మందిర వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర ట్రస్టీలు ఎం.దుర్గాప్రసాద రామకోటేశ్వరరావు శర్మ, ప్రశాంత్ విశ్వనాథ్ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ సోమవారం శ్రీలక్ష్మీగణపతి, సాయిమూల మంత్ర, నవగ్రహ, నక్షత్ర హోమం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 30వ తేదీ మంగళవారం ఉదయం ఆరు గంటలకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, 9.30 గంటలకు శ్రీసిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామివారి కల్యాణం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు మందిర వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా వారు కోరారు.